క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ హనుమకొండకు చెందిన ఆటోడ్రైవర్ మేకల రఘుపతి (40) వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదే రోజు రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సతీష్ మంగళవారం తెలిపారు. మృతుని భార్య పుష్ప ఫిర్యాదు మేరకు మండలంలోని ఉప్పల్‌కు చెందిన కారు డ్రైవర్ మొండెద్దుల దేవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పరకాల : నడికూడ మండలంలోని చౌటుపర్తి క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. బావగాని సురేష్ తన ద్విచక్ర వాహనంపై పోచారం నుంచి చౌటుపర్తికి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన టవేరా వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సురేష్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన టవేరా వాహనాన్ని గుర్తించారు. కేసు నమోదు చేశారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్



కమలాపూర్ : యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని అంబాల గ్రామానికి చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల విద్యార్థి బోయిని ప్రదీప్ ముదిరాజ్ నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బోయిని ప్రదీప్ విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో యువతను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. యూత్ కాంగ్రెస్‌ను నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పల్లెలకూ విస్తరింపజేయనున్నట్లు చెప్పారు. ప్రదీప్ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండవు చరణ్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు దేశిని అయిలయ్యగౌడ్, ఇతర నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

‘ధర్మకర్తల మండలి నియామకంలో మోసం’

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలను మోసగించిందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడారు. మండలిలో గొల్ల కురుమలకు స్థానం కల్పించినట్లు నమ్మిస్తూనే ఎండోమెంట్ చట్టం పేరుతో అవమానించిందని తెలిపారు. మండలి నియామకంలో సభ్యుల అర్హత అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, ఆలయ అధికారులకు తెలిసినా డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. జీఓ నెంబర్ 11 జారీ అయిన క్రమంలో మండలి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకోగా సదరు జీఓను హైకోర్టు రద్దు చేసిందంటూ ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు జిల్లా ఎండోమెంట్ అధికారులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రద్దు చేశారని చెప్పారు. మండలి ఏర్పాటు కాలేదని జిల్లా అధికారులు స్పష్టం చేసినా ఆలయంలోని చైర్మన్ కార్యాలయాన్ని ప్రతిపాదిత సభ్యులకు ఎలా కేటాయించారని ఈఓను ప్రశ్నించారు. హైకోర్టు ఉత్తర్వులు, ఎండోమెంట్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న అధికారులు, ప్రతిపాదిత ధర్మకర్తల మండలిపై చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్ శాఖ ఉన్నతాధికారులను కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.

బహుమతుల అందజేత

గీసుకొండ : మండలంలోని చంద్రయ్యపల్లిలో వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం రాత్రి క్లబ్ ప్రతినిధులు బహుమతులను పంపిణీ చేశారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను క్లబ్ మహిళా ప్రతినిధి డాక్టర్ హరి రమాదేవి, అధ్యక్షుడు దీకొండ నర్సింహరావు అందించారు. క్లబ్ ప్రతినిధులు ఫీలా రాధిక, విశ్వనాధుల అర్పిత, రామగిరి కవిత, మామిడాల రాజ్యలక్ష్మి, గాయత్రి, అనంతుల కుమారస్వామి, గాదె ఎల్లరాజు, సర్పంచ్ ఆకుల ప్రవంతి, రుద్ర ప్రసాద్, ఉపసర్పంచ్ వేణు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

గీసుకొండ : ఉత్తరాయణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని మండలంలోని ఊకల్ హవేలీ గ్రామంలోని సుప్రసిద్ధ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, భక్తులు నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాన్ని మల్లెపూల దండలతో ప్రత్యేకంగా అందంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షతోపాటు భక్తులు అభిషేక, అర్చన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర

- పోటెత్తిన భక్తులు, కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- అట్టహాసంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



జాతరలో శావ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి జాతర మంగళవారం కనుల పండువలా సాగింది. మండలంలోని పలు గ్రామాలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసాచార్యులు పంచామృతాలతో అర్చన అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, టెంకాయలను శ్రీరుణ్మి సత్యభామ సహితంగా కొలువైన శ్రీలక్ష్మీనర్సింహస్వామికి సమర్పించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం నిర్వహించిన శావ కార్యక్రమం వైభవంగా సాగింది. జాతర చివరి రోజు కావడంతో సాయంత్రం గుట్ట నుంచి గ్రామంలోని ఆలయానికి ఉత్సవ విగ్రహాలను అట్టహాసంగా ఊరేగించారు. మహిళల కోలాట బృందాల నృత్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ, నర్సింహస్వామి భక్త మండలి భక్తి పాటలతో కోలాహలంగా ఊరేగింపు సాగింది. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు, దామెర ఎస్సై అనిల్‌కుమార్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు మెంతుల రాజు, ఉపసర్పంచ్ సాగర్ పాల్గొని మొక్కులు చెల్లించగా ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులతోపాటు అర్చకులు వినయకుమారచార్యులు, అఖిల్‌కుమారచార్యులు, బాలక్రిష్ణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రానున్న ఎన్నికల్లోనూ అధికారం ఖాయం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : రానున్న ఎన్నికల్లోనూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలోని తన నివాసంలో నడికూడ మండలంలోని నర్సాపూర్, పులిగిల్ల, నర్సక్కపల్లి, వరికోల్, రాయపర్తి, నార్లాపూర్ గ్రామాల ముఖ్యనాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం శ్రేణులు సైనికుల్లా పని చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ నడికూడ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కేఆర్ఆర్ ట్రోఫీ విజేతగా ‘డాల్ఫిన్’



డాల్ఫిన్ టీంకు ట్రోఫీని అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ కొక్కిరాల రాకేష్‌రావు

పరకాల : కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించిన వివేకానంద ప్రీమియర్ లీగ్ క్రికెట్ ట్రోఫీ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతగా హనుమకొండకు చెందిన డాల్ఫిన్ టీమ్ నిలవగా రూ.50 వేల నగదుతోపాటు ట్రోఫీని కేఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొక్కిరాల రాకేష్‌రావు అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన కామారెడ్డిపల్లెకు చెందిన తేజ 11 టీమ్‌కు రూ.25 వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పీవైసీ సభ్యులు ఇంగిళి వీరేష్‌రావు, పుల్లూరి తిరుపతిరావు, మహేశ్, అజయ్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు రాకేష్‌రెడ్డి పూజలు



ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి మంగళవారం రాత్రి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, అర్చకులు ఆయన స్వాగతం పలికి పూజలు చేయించారు. పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ నాగేశ్వర్‌రావు రాకేష్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. రాకేష్‌రెడ్డి వెంట రవినాయక్, దండు కిషన్, గూబ దేవేందర్, చిర్ర శరత్, కాటబోయిన రాజు ఉన్నారు.

కైలాస రథాలు అందించాలి



సీఎం కేసీఆర్‌కు లేఖ పంపిస్తున్న అమ్మ అశోక్, నాయకులు

శాయంపేట : రాష్ట్రంలో ప్రతి గ్రామాలకు కైలాస రథాలు అందించాలని తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి యువజన విభాగం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు పోస్టు ద్వారా మంగళవారం లేఖ పంపించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అశోక్ మాట్లాడారు. పేద కుటుంబాల్లోని వ్యక్తులు చనిపోయిన సందర్భాల్లో పాడె మోసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్మశాన వాటికల నిర్మాణానికి నడుం బిగించిందని గుర్తు చేశారు. వెంటనే అన్ని గ్రామాలకు కైలాస రథాలు అందించి పేద కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీజేవై జిల్లా నాయకులు నూనేటి కుమారస్వామి, బైరి ప్రసాద్‌రెడ్డి, వైద్యుల శ్రావణ్‌రెడ్డి, దైనంపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

‘భగవద్గీత’తో అన్ని సమస్యల పరిష్కారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న ఓంప్రకాశ్, ప్రబోధ సేవా సమితి బాధ్యులు

ఆత్మకూరు : భగవద్గీత గ్రంధాన్ని అధ్యయనం చేస్తే అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ఓంప్రకాశ్ తెలిపారు. మండలంలోని నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి జ్ఞానవేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. భగవద్గీతలోని పలు అంశాలను జనానికి వివరించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ఓంప్రకాశ్ మాట్లాడారు. సమాజంలోని హిందువులందరూ భగవద్గీతను అధ్యయనం చేయాలని సూచించారు. తద్వారా మెరుగైన జీవనం గడపొచ్చని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల, పద్మ, రావణాచారి, అక్షయ, త్రైతశ్రీ, శశిరేఖ, విక్రమ్, చారి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో లౌకిక విలువలకు దెబ్బ



మాట్లాడుతున్న కాడబోయిన లింగయ్య

ఐనవోలు : బీజేపీ మతోన్మాద పాలనలో దేశంలోని లౌకిక విలువలకు దెబ్బ పడిందని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో దీకొండ ఉప్పలయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఉప్పలయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగాయని తెలిపారు. దేశంలోని వివిధ మతాల సంప్రదాయాలను దెబ్బతీసేలా బీజేపీ కుట్ర చేస్తోందని చెప్పారు. బీజేపీ మతోన్మాద పాలనపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముల్కలగూడెం సర్పంచ్, ఆ పార్టీ మండల కమిటీ సభ్యుడు బండి పర్వతాలు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు లేవన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతం అవుతుండగా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని చెప్పారు.

గ్రామ శాఖ కార్యదర్శి ఎన్నిక

సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా కొంకాల నారాయణరెడ్డిని, సహాయ కార్యదర్శిగా దీకొండ ఉప్పలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి, ఉప్పలయ్య మాట్లాడారు. గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరాటాలు నిర్మిస్తామన్నారు. సమావేశంలో దొనికెన వెంకటేశ్వర్లు, జక్కుల నర్సయ్య, బొమ్మకంటి యాకయ్య, రాయపురం కొమురయ్య, కవిత, వజ్రమ్మ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’కు వసతులు కల్పించండి



ధర్మసాగర్ : కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధర్మసాగర్ : ఈనెల 19న ప్రారంభం కానున్న నేపథ్యంలో కంటి వెలుగు కేంద్రాల్లో వసతులు కల్పించాలని బాధ్యులను ధర్మసాగర్, వేలేరు మండలాల ప్రత్యేక అధికారులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఆ మండలాల్లోని కంటి వెలుగు కేంద్రాలను సోమవారం వారు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బాధ్యులకు సూచనలు, సలహాలు అందించారు. కంటి వెలుగు నిర్వహణలో అధికారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. 19న ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని, నారాయణగిరి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లోని, జానకిపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలోని కేంద్రాలతోపాటు వేలేరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి గోపీనాథ్, ఎంపీఓలు కరుణాకర్‌రెడ్డి, విమల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను వినియోగించుకోవాలి



శాయంపేట : సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్

శాయంపేట : అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మండల ప్రత్యేక అధికారి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ (జీఎం) హరిప్రసాద్ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో, సూర్యానాయక్‌తండా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోని కంటి వెలుగు శిబిరాలను ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కంటి సమస్యలున్న ప్రజలందరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ, సర్పంచ్‌లు కందకట్ల రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



కమలాపూర్ : ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పెషలాఫీసర్ జగదీశ్వర్

కమలాపూర్ : రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డీపీఓ వి.జగదీశ్వర్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ గీతాలక్ష్మి, ఎంపీడీఓ పల్లవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్షిణీ ప్రియ, కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర మౌనిక, పీహెచ్‌ఎన్ దయామణి, హెచ్‌ఈఓ రమేష్, హెల్త్ సూపర్‌వైజర్లు శోభ, మేరీ విజయ, విప్లవ్‌కుమార్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కట్టించడంలో పాలకులు విఫలం



ప్రభుత్వ భూమిలో జెండాలు పాతి నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

దామెర : పేదలకు స్థలాలిచ్చి ఇళ్లు కట్టించడంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని సర్వే నెంబర్ 128లోని 32 ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదల కోసం మంగళవారం ఆ పార్టీ జెండాలు పాతారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. సొంతిళ్లలో పేదలు ఆత్మగౌరవంతో బతకాలని కాంక్షించారు. పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఎనిమిదేళ్లుగా పోరాడుతున్నట్టు తెలిపారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామన్న హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని మండిపడ్డారు. ఇప్పటికైనా అర్హులందరికీ స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల మల్లేష్, నాయకులు కొట్టెపాక రవి, కండె నర్సయ్య, మాలోతు మంగ, అంబి సాంబయ్య, పోచయ్య, గోవిందు రవికుమార్, శివకుమార్, రాజ్‌కుమార్, అనూష, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

‘మండల అధ్యక్షుడి రాజీనామాతో నష్టం లేదు’



భీమదేవరపల్లి : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రకాష్ రాజీనామాతో పార్టీకి నష్టం లేదని మాజీ ఎంపీపీలు బొజ్జపురి అశోక్ ముఖర్జీ, కోడూరి సరోజన తెలిపారు. మండలంలోని ముల్కనూర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రకాష్ స్వార్థం కోసమే రాజీనామా చేశాడని తెలిపారు. పార్టీలో ప్రకాష్‌కు తగిన గుర్తింపు లభించిన క్రమంలోనే జెడ్పీటీసీగా టికెట్ ఇచ్చారని చెప్పారు. ప్రకాష్‌కు పార్టీ మీద గౌరవం లేదని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ నాయకులు కేతిరి లక్ష్మారెడ్డి, పిడిశెట్టి కనకయ్య, సుదర్శన్‌రెడ్డి, మంగ రాంచంద్రం, కొలుగూరి రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజల సహకారం కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్

శాయంపేట : అభివృద్ధిలో ప్రజల సహకారం కీలకమని మండల ప్రత్యేక అధికారి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ హరిప్రసాద్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కందగట్ల రవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన గ్రామ సభకు ముఖ్యఅతిథిగా స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రజలు సకాలంలో ఇంటి, నల్లా, ఇతర పన్నులు సకాలంలో చెల్లించాలని సూచించారు. తద్వారా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. తొలుత గ్రామంలో నెలకొన్న తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య, తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్ జనార్దన్‌కు జాతీయస్థాయి అవార్డు



జాతీయ స్థాయి వివేకానంద అవార్డు తీసుకుంటున్న జనార్దన్

శాయంపేట : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల గెజిటెడ్ లైబ్రేరియన్ కందగట్ల జనార్దన్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వివేకానంద స్మారక జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. స్వామి వివేకానందుడి 161వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నిర్వాహకులు అవార్డు అందించి సత్కరించారు. సాహితీ రంగంలో జనార్దన్ చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా ఆయనకు అవార్డు లభించింది. జనార్దన్‌ను సాహితీవేత్తలు, కళాకారులు అభినందించారు.

‘దళితబంధు’ ఎంపిక ఐఏఎస్‌లకు అప్పగించాలి

హన్మకొండ : దళితబంధు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఐఏఎస్ అధికారులకు అప్పగించాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. పేద దళితులకు దళితబంధులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 14న హైదరాబాద్ ఇందిరాపార్కు తలపెట్టిన ధర్నా కార్యక్రమం కరపత్రాలను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడారు. ఎమ్మెల్యేలు దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో చేయడంతో పైరవీదారులు, దళారులు పెరిగారని చెప్పారు. లబ్ధిదారు నుంచి రు.2 లక్షల చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దళితబంధు పథకం ఎమ్మెల్యేల ఇంటి పథకంగా తయారైందని ధ్వజమెత్తారు. ఈ పథకం పూర్తి స్థాయిలో అమలై మంచి ఫలితాలు రావాలంటే పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలన్నారు. దళితబంధు అమలుకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని, ఐఏఎస్ అధికారిని చైర్మన్‌గా నియమించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సాతూరు వెంకన్న, నాయకులు మేడ స్వామి, దేవేందర్, బొంకూరి భద్రయ్య, కోమల, సుధాకర్, అంబాల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్లలోని జెడ్పీ హైస్కూల్‌లో 2006–07 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. 15 ఏళ్ల క్రితం నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. నాటి ఉపాధ్యాయులను శాలువాలు కప్పి, మెమొంటోలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభారతి, శాంతయ్య, రామ్మోహన్, తిరుపతిరెడ్డి, శ్యాంసుందర్, శరబంధం, లలిత, అరుణ, కిష్టయ్య, మల్లన్న, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి.రాజ్‌కుమార్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274